

మోదకొండమ్మ ఆలయం కిటకిట



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు - 6లో

ప్రమాదకరంగా పాడేరు ఘాట్

తుప్పలతో తిప్పలు!

- వాహన చోదకులకు అవస్థలు
- మలుపులు కనిపించక ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- కొన్నాళ్లుగా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఈ దుస్థితి



ఘాట్‌లో అమ్మవారి పాదాలుకు దగ్గర్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు, తుప్పలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

పాడేరు ఘాట్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో వాహన చోదకులు నిత్యం తిప్పలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు, చెట్ల కొమ్మలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్య కారణంగానే ఇటీవల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడం, మలుపుపై స్పష్టత లేక బోల్తా కొట్టడం వంటి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈనెల 4వ తేదీన పాడేరు ఘాట్‌లో ముందు వెళుతున్న బైక్‌ను గుర్తించలేక వ్యాన్ ఢీకొట్టింది. దీంతో కొత్తపాడేరుకు చెందిన పాంగి రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి ప్రమాదాలు ఘాట్‌లో తరచూ చోటుచేసుకుంటున్నాయి. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించాలంటే ఘాట్ ప్రయాణం తప్పనిసరి. పాడేరు మండలం మినుములూరు నుంచి వి.మాడుగుల మండలం గరికబంద వరకు 25 కిలోమీటర్లు ఘాట్ మార్గమే. ఏజెన్సీలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన వాహనాలు నిత్యం రాకపోకలు జరుగుతుంటాయి. అలాగే పాడేరు జిల్లా కేంద్రం కావడంతో వాహనాల రాకపోకలు మరింతగా పెరిగాయి. దీంతో స్థానిక ఘాట్ మార్గంలో నిత్యం వాహనాలతో రద్దీగానే ఉంటుంది.

కొన్నాళ్లుగా జరగని జంగిల్ క్లియరెన్స్..

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఘాట్ మార్గంలో తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతి ఏడాదిలో కనీసం రెండు మార్లు ఘాట్‌లో విధిగా జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉంది. కానీ కొన్నాళ్లుగా ఎటువంటి జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ఘాట్ అంతా తుప్పలే దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి రోడ్డుకు ఇరువైపులా రెండేసి అడుగుల చొప్పున అంచులు ఉంటాయి. కాని ఆ అంచులన్నీ తుప్పలు కప్పేశాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఎక్కువగా తుప్పలు, చెట్ల కొమ్మలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం కనపడక ప్రమాదాలు జరుగు తున్నాయి. అధికారులు స్పందించి ఘాట్ మార్గంలో ప్రమాదకరంగా మారిన తుప్పలను తొలగించాలని డ్రైవర్లు, ప్రయాణికులు కోరుతున్నారు.



వంట్లమామిడి సమీపంలో మలుపును మూసేసిన తుప్పలు

ఆ గిరి పల్లెలు సురక్షితమేనా?


వయనాడ్ ఘటనతో తెరపైకి కొండవాలు పల్లెల రక్షణ అంశం

- పాడేరు ఏజెన్సీలో కొండలను ఆనుకునే సగానికి పైగా పల్లెలు
- భారీ వర్షం వస్తే బిక్కుబిక్కుమంటున్న గిరిజనం
- 2006లో కోడిపుంజువలసలో కొండచరియలు విరిగిపడి 19 మంది జలసమాధి

(ఆంధ్రజ్యోతి-పాడేరు)

పాడేరు మన్యం.. సముద్ర మట్టానికి 3,500 అడుగుల ఎత్తులో ప్రకృతి అందాల నడుమ సుందర ప్రదేశం.. కొండ కోనల్లో అడవి బిడ్డల భిన్న జీవనం.. అక్కడ భౌగోళిక పరిస్థితులు ప్రత్యేకం.. కొండల్లో అనేక గిరి పల్లెలుండగా కొండవాలు ప్రాంతాల్లోనూ ఎన్నో పల్లెలు. ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో కొండచరియలు సృష్టించిన విలయంలో వందల సంఖ్యలో ప్రజల ప్రాణాలు కోల్పోయిన ఘటనతో కొండవాలు ప్రాంతాల్లో పల్లెలు ఎంతవరకు సురక్షితమనేది చర్చనీయాంశమైంది.

ఏజెన్సీ 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,915 గిరిజన పల్లెల్లో ఏడు లక్షల మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. మొత్తం గ్రామాల్లో సగానికి పైగా పల్లెలు కొండవాలు ప్రాంతాల్లోనే ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ మారుమూల ప్రాంతాల్లోని గిరిజన పల్లెలు కొండల కిందనే ఉన్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో కొండలకు చేరువగా ఉన్న పల్లెలకు దూరంగా వాగులు ఉండగా.. మరికొన్ని పల్లెలకు అత్యంత సమీపంలోనే కొండలు, వాగులున్నాయి. ఉదాహరణకు పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ చింతగున్నెల, సోలములు, వంజంగి పంచాయతీ సంపాల, అనంతగిరి మండలం వాలాసి వంటి పల్లెలు కొండవాలు ప్రాంతాల్లోనే ఉన్నాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే ఆయా పల్లెల్లోని గిరిజనులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తారు. అయితే వాయినాడ్ అంత భారీ స్థాయిలో కానప్పటికీ ఏజెన్సీలోనూ కొండచరియలు విరిగిపడడం లేదా భారీ వర్షాలకు ఇళ్లు నేలమట్టమై గిరిజనులు మృతి చెందిన ఘటనలున్నాయి.



కొండవాలున ఉన్న అనంతగిరి మండలం వాలాసి గ్రామం



కొండకోనల్లో ఉన్న పెదబయలు మండలం ఇంజెరి గ్రామం

హుద్‌హుద్‌లో కుటుంబమే సమాధి

2014లో సంభవించిన హుద్‌హుద్ తుఫాన్‌కు అరకులోయ మండలం మేదరశాల గ్రామంలో గిరిజన కుటుంబం సమాధి అయ్యింది. భారీ వర్షానికి ఇల్లు కూలిపోయి కుటుంబ సభ్యులు ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అలాగే గెడ్డలు పొంగి గిరిజనులు మృతి చెందుతున్న ఘటనలు అనేకం. ఇదిలా ఉండగా అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామంలో 2006లో వయనాడ్ తరహాలో కొండచరియ విరిగిపడిన ఘటనలో 19 మంది గిరిజనులు జలసమాధి అయ్యారు. ఆ తర్వాత అంత భారీ స్థాయిలో కానప్పటికీ అక్కడక్కడ ఒకటి అర ఘటనలు జరుగుతునే ఉన్నాయి. అయితే గిరిజనులు మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకోవడం, అక్కడ తిండి గింజలను సమకూర్చుకుని కొండల్లోనే జీవనం సాగిస్తుండడంతో వారిని ఇతర, సురక్షిత ప్రాంతాలకు తరలించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏదైనా అనుకోని ఘటనలు జరిగినపుడు మాత్రమే అధికార యంత్రాంగం అప్పటి అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టడం తప్ప ప్రత్యామ్నాయ మార్గం లేదు. అయితే భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే పరిస్థితుల్లో ఉన్న పల్లెలను ముందుగానే గుర్తించి, భవిష్యత్తులో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరమైతే ఎంతైనా ఉంది.

మారుమూల గ్రామాల్లో ఎన్ఆర్ఎస్‌టీలు

పాఠశాలలు లేని గిరి పల్లెల్లో ఏర్పాటు

- సెప్టెంబరు నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు నిర్వహణ
- వైసీపీ ప్రభుత్వ హయాంలో 12 మాత్రమే ఏర్పాటు
- ప్రస్తుత కూటమి ప్రభుత్వం 39 మంజూరు



విద్యకు దూరమై పశువులు కాస్తున్న గిరి బాలలు(ఫైల్)

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు లేక కొంతమంది విద్యార్థులు విద్యకు దూరవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రాథమిక విద్యను అందించడం కోసం నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లు (ఎన్ఆర్ఎస్‌టీసీ) ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాలో 39 నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లను మంజూరు చేశారు.

మన్యంలో విద్యార్థుల స్థితిగతులపై విద్యాశాఖాధికారులు వివరాలు సేకరించారు. మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు లేక చాలా గ్రామాల్లో బడిఈడు పిల్లలు చదువుకోలేకపోతున్నారని గురించారు. ఇందుకోసం 39 ఎన్ఆర్ఎస్‌టీసీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించింది. పాఠశాల లేని గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, అందులోనే విద్యార్థులకు ప్రాథమిక బోధన చేస్తారు. డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థిని విద్యావలంటీర్‌గా నియమించి, ఆర్నెళ్లు అంటే ఈ ఏడాది సెప్టెంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎన్ఆర్ఎస్‌టీసీలను నిర్వహిస్తారు. వాటిని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త పర్యవేక్షిస్తారు. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వం కేవలం 12 మాత్రమే ఎన్ఆర్‌టీసీలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 39 ఎన్ఆర్‌టీసీలను మంజూరు చేసింది. మారుమూల ... మిగతా 6వ పేజీలో

అంధకారంలో 9 గిరిజన గ్రామాలు

మరంభీమవరం పంచాయతీలో నెల రోజులుగా ఆదివాసీల అవస్థలు

- రాత్రయితే అడవి జంతువుల నుంచి రక్షణకు కర్రలతో మంటలు వేసుకుంటున్న గిరిజనులు
- పట్టించుకోని ఈపీడీసీఎల్ సిబ్బంది

కొయ్యూరు, ఆగస్టు 11:

మండలంలోని మరంభీమవరం పంచాయతీకి చెందిన తొమ్మిది గిరిజన గ్రామాలు నెలరోజులుగా అంధకారంలో మగ్గుతున్నాయి. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సాంకేతిక కారణాలతో ఆ గ్రామాలు చీకట్లో ఉంటున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా గిరిజనులు చీకటి పడితే కర్రల మంటలు వేసుకొని జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మరంభీమవరం పంచాయతీలోని కాకులమామిడి, జాలిగెడ్డ, మడికోట, గాదిమామిడి, పుట్టకోట, పీఎల్ కొత్తూరు, బొబ్బిలికొండ, బుగ్గిరాయి, మైనకోట గ్రామాలకు గత నెల రోజులుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని ఆయా గ్రామాల గిరిజనులు తెలిపారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ చేయాల్సిన సంబంధిత శాఖ సిబ్బంది చర్యలు చేపట్టలేదు. గతంలో కరెంట్ లేకుంటే కిరోసిన్ దీపాల వెలుతురులో కాలక్షేపం చేసేవారమని, ఇప్పుడు కిరోసిన్ సరఫరా లేకపోవడంతో కర్రల మంటల వెలుగులో ఉంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఈపీడీసీఎల్ స్థానిక ఏఈ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా.. ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

బొర్రాగుహల అందాలకు కలెక్టర్లు ఫిదా

కుటుంబ సమేతంగా సందర్శించిన అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు

- గుహల్లో బ్లీచింగ్ బదులుగా స్ప్రేయింగ్ చేయించాలని మేనేజర్‌ను ఆదేశించిన కలెక్టర్
- పర్యాటక శాఖ నుంచి బకాయి ఇప్పించాలని కలెక్టర్‌కు బొర్రా సర్పంచ్ వినతి
- జిప్‌లైన్ వివాదాన్ని పరిష్కరిస్తానని హామీ
- గిరిజన మ్యూజియం కూడా సందర్శన



బొర్రా గుహల్లో ఫొటో దిగుతున్న కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయకృష్ణన్, పిల్లలు

అనంతగిరి/అరకులోయ, ఆగస్టు 11:

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు, అరకులోయలోని గిరిజన మ్యూజియంలను అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఏఎస్ దినేశ్‌కుమార్, విజయకృష్ణన్ తమ ఇద్దరు పిల్లలతో ఆదివారం సందర్శించారు. బొర్రాగుహల అందాలను చూసిన వారు అబ్బురపడ్డారు. గుహలు చరిత్రను గైడ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన గుహలులో ఏర్పాటు చేసిన లైటింగ్ చాలా బాగుందని కితాబు ఇచ్చారు. గుహలు లోపల బ్లీచింగ్ బదులుగా స్ప్రేయింగ్ చేయించాలని, డస్ట్‌బిన్లు మరిన్ని ఏర్పాటు చేయాలని మేనేజర్ గౌరీ శంకర్‌ను కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా బొర్రా సర్పంచ్ అప్పారావు, వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 2007వ సంవత్సరం నుంచి గుహలకు వచ్చే ఆదాయంలో 20 శాతం వాటాను పంచాయతీకి ఇస్తామని చెప్పి, అమలు చేయడంలోని పర్యాటక శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు రూ.80 లక్షల వరకు పంచాయతీకి వాటా ఇచ్చారని, పంచాయతీకి రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని కలెక్టర్ ... మిగతా 6వ పేజీలో

అల్లం వంగడాలపై పరిశోధనలు

ఏడు మేలిజాతి రకాలపై అధ్యయనం

- మూడేళ్ల సాగులో సత్ఫలితాలు
- రెండు రకాలు అత్యుత్తమమైనవిగా నిర్ధారణ
- వచ్చే ఏడాది పంపిణీకి శాస్త్రవేత్తల ప్రణాళిక



నాడియా బోల్డ్ అల్లం పంట (ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 11:

మేలిజాతి అల్లం వంగడాలపై స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రారంభించారు. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న ఏడు రకాల మేలిజాతి వంగడాలపై అధ్యయనం చేస్తున్నారు. మూడేళ్ల ప్రయోగాత్మక సాగు పూర్తిచేసిన శాస్త్రవేత్తలు ఈ ఏడాది తుది దశ అధ్యయనం చేపడుతున్నారు.

విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం గిరిజన గ్రామాల్లో 90 వేల హెక్టార్లలో అల్లం సాగు జరుగుతుంది. ఆదివాసీలు ప్రాంతీయ దేశవాళి రకాలను సాగు చేసుకుంటున్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు 2010 నుంచి గిరిజన రైతులు నాడియా, సుప్రభ రకం అల్లం వంగడాలను సాగు చేస్తున్నారు. నాడియా రకం ఎకరానికి పది టన్నుల సాధారణ దిగుబడి కాగా రైతులు 8 నుంచి 9 టన్నులు సాధిస్తున్నారు. అయితే మార్కెట్‌లో ... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీకి కూటమి సై

తెరపైకి బైరా దిలీప్ చక్రవర్తి పేరు

- నేడు అభ్యర్థి పేరు అధికారికంగా ప్రకటన?



విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఉప ఎన్నికలో పోటీ చేయాలని కూటమి నేతలు నిర్ణయించారు. అభ్యర్థిత్వం విషయానికి వస్తే అనకాపల్లి ఎంపీ టికెట్ ఆశించిన బైరా దిలీప్ చక్రవర్తి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్లకు ఈనెల 13వ తేదీతో గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నంలోపు అధికారికంగా అభ్యర్థి పేరు ప్రకటించాలని కూటమి నేతలు భావిస్తున్నారు.

ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన కూటమి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, తదితరులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేయాలని నేతలంతా నిర్ణయించారు. పోటీకి సుముఖంగా ఉన్న పీలా గోవింద, గండి బాబ్జీల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బైరా దిలీప్ పేరు చర్చకు వచ్చింది. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు పల్లా శ్రీనివాసరావుకు నివేదించారు. ఉమ్మడి జిల్లాలో మిగిలిన సీనియర్ నేతలతో ఒకసారి చర్చించిన మీదట సోమవారం అభ్యర్థి పేరును ప్రకటిస్తామని టీడీపీ నేత ఒకరు తెలిపారు.

టెండర్ల మాయాజాలం

- నీటి సరఫరా, యూజీడీ నిర్వహణకు టెండర్లు పిలిచిన జీవీఎంసీ
- 30-40 శాతం లెస్‌కు కాంట్రాక్టర్ల బిడ్లు
- అంత తక్కువకు కోట్ చేయడంపై అనుమానాలు
- అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా?.., లేక కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేయాలనుకుంటున్నారా?
- ఇంజనీరింగ్ విభాగంపై నిత్యం అవినీతి ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ టెండర్లలో ఏదో మాయాజలం జరుగుతోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలను తయారుచేసి టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ఆ మొత్తంలో 40 శాతం తక్కువకు పనులు చేసేందుకు సిద్ధమంటూ బిడ్‌లు దాఖలు చేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు పెంచి టెండర్లు పిలుస్తున్నారా? లేక కాంట్రాక్టర్లు పనులు తూతూమంత్రంగా చేసి బిల్లులు చేసుకోవాలనుకుంటున్నారా?...అనే విషయం అంతుబట్టడం లేదు.

నగరంలో నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థ బాధ్యతలను ఇంజనీరింగ్ విభాగంలోని ఒక సెక్షన్ పర్యవేక్షిస్తుంది. దీనికి ప్రత్యేకంగా ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో పెద్ద యంత్రాంగమే పనిచేస్తుంది. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు, ఎక్కడైనా పైప్‌లైన్‌లు పాడైపోతే కొత్తవి ఏర్పాటుచేయడం, లీకేజీలు ఏర్పడితే వాటిని సకాలంలో సరిచేయడంతో పాటు యూజీడీ ఎక్కడైనా పొంగితే సమస్య పరిష్కరించేందుకు జీవీఎంసీ ఏటా రూ.250 కోట్లు ఖర్చు చేస్తుంది. జోన్‌ల వారీగా నీటి సరఫరా పైప్‌లైన్ల నిర్వహణకు, యూజీడీ నెట్‌వర్క్ నిర్వహణకు టెండర్లు పిలుస్తుంది. ఏడాదిపాటు ఆయా పనులు చేపట్టేలా ఇటీవల దాదాపు రూ.12.5 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. దీనికి కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 30-40 శాతం వరకూ తక్కువకు బిడ్‌లు దాఖలు చేశారు. ఎవరు ఎక్కువ తక్కువకు బిడ్ వేస్తే వారికి పనులను అప్పగించాల్సి ఉంటుంది కాబట్టి ఇంజనీరింగ్ అధికారులు వారితో అగ్రిమెంట్‌లు పూర్తిచేసుకునే పనిలో ఉన్నారు. ఇదిలావుంటే ఏదైనా ఒక పని చేయాలని ఇంజనీరింగ్ అధికారులు భావించినప్పుడు ముందుగా అందుకు అవసరమైన పరికరాలు, కూలీల ఖర్చు వంటి వాటిని స్టాండర్డ్ రేటు (ఎస్ఆర్) ప్రకారం లెక్కించి అంచనాలు తయారుచేస్తారు. దీనిని ఏఈ స్థాయి అధికారి పరిశీలించిన తర్వాత డీఈకి పంపిస్తారు. అక్కడ డీఈ, ఈఈ స్థాయి అధికారులు స్క్రూటినీ చేసి అంచనాలన్నీ ఎస్ఆర్ రేటుకు అనుగుణంగా ఉన్నాయా?, లేదా? అనేది పరిశీలించి టెండర్ పిలవడానికి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఉన్నతాధికారుల ఆమోదంతో ఆయా పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలుస్తారు. టెండర్ మొత్తంలోనే కాంట్రాక్టర్ ప్రాఫిట్ కింద 13 శాతం, జీఎస్టీ కింద 18 శాతం కలిసి ఉంటుంది. టెండర్ దక్కించుకోవాలని తాపత్రయపడేవారు తమకు వచ్చే ప్రాఫిట్‌లో ఎంతోకొంత తగ్గించుకుని బిడ్ దాఖలుచేయడం సాధారణంగా జరుగుతుంది. అంటే కాంట్రాక్టర్ ప్రాఫిట్‌గా పేర్కొన్న 13 శాతం మేరకు గరిష్ఠంగా తగ్గించుకోవాల్సి ఉంటుంది. అంతకంటే లెస్‌కు బిడ్ వేస్తే కాంట్రాక్టర్ నష్టపోవడం ఖాయం. కానీ జీవీఎంసీలో మాత్రం దీనికి విరుద్ధంగా టెండరు ప్రక్రియ జరుగుతుండడం సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

40 శాతం వరకూ తక్కువకు టెండర్లు

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో టెండర్లను కొంతమంది కాంట్రాక్టర్లు ఏకంగా 40 శాతం లెస్‌కు బిడ్ వేసి దక్కించుకుంటుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. దీనిని ఏకంగా 40 శాతం తక్కువకు టెండర్ వేసి ఒక కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు ఆ టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా యూజీడీ, నీటి సరఫరా నిర్వహణకు కొన్ని టెండర్లు పిలిచారు. వీటిలో ఆరు వర్కులను కొంతమంది కాంట్రాక్టర్లు 30 శాతం లెస్‌కు టెండర్ వేసి దక్కించుకోవడంతో మిగిలిన కాంట్రాక్టర్లు అవాక్కయ్యారు. 30 శాతం లెస్‌తోపాటు 18 శాతం జీఎస్టీ పోతే మిగిలిన 52 శాతం మొత్తంతో 100 శాతం పనులు ఎలా పూర్తిచేస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఆ పనులను పూర్తిస్థాయిలో చేయకుండా అధికారులను మేనేజ్ చేసుకుంటారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. టెండర్ విలువలో సగం మొత్తానికే పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకువస్తున్నారంటే అధికారులు తయారుచేసిన అంచనాలను భారీగా పెంచేసి ఉండాలని, లేదంటే కాంట్రాక్టర్లు సగం పనులు చేసి బిల్లులు తీసుకునేందుకు లోపాయికారీగా ఒప్పందం చేసుకుని ఉంటారని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ స్వయంగా దృష్టిసారించి, ఇంజనీరింగ్ విభాగంలోని టెండర్ల ప్రక్రియను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

రైళ్లు ఆలస్యం

- రీ షెడ్యూల్‌తో హౌరా-చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ లేటు
- మూడు గంటలు ఆలస్యంగా విశాఖ చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్
- గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర...

విశాఖపట్నం, ఆగస్టు 11:

వివిధ రైల్వే డివిజన్లలో నిర్మాణ పనులు జరుగుతుండడంతోపాటు లింక్ రేక్ అందుబాటులో లేని కారణంగా పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ఆలస్యంగా నడుస్తున్నాయి. హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12830)ను రీ షెడ్యూల్ చేయడంతో ఆదివారం సుమారు 14 గంటలు ఆలస్యంగా నడిచింది. నిర్దిత సమయం ప్రకారం ఈ రైలు శనివారం రాత్రి 11.55 గంటలకు హౌరాలో బయలుదేరాల్సి ఉండగా, లింక్ రేక్ అందుబాటులో లేకపోవడంతో ఆదివారం సాయంత్రం 4.12 గంటలకు బయలుదేరింది. అలాగే హౌరా-తిరుపతి హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (20889) శనివారం హౌరాలో రెండు గంటల 48 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున 2.00 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు ఉదయం 5.00 గంటలకు వచ్చింది. ఇక హౌరా-ఎర్నాకులం అంతోద్యయ ఎక్స్‌ప్రెస్ శనివారం హౌరాలో మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ఆదివారం ఉదయం 4.45 గంటలకు దువ్వాడ స్టేషన్‌కు చేరాల్సిన ఈ రైలు 7.55 గంటలకు చేరింది.

మూడు గంటలు ఆలస్యంగా చేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) ఆదివారం ఉదయం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం 5.05 గంటలకు బయలుదేరి...రాత్రి 10.50 గంటలకు విజయవాడ స్టేషన్‌కు రావాల్సి ఉండగా...అర్ధరాత్రి 12.00 గంటలకు చేరింది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా, ఉదయం 9.00 గంటలకు వచ్చింది. అలాగే శనివారం దాదాపు నిర్దిత సమయానికి సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఆదివారం ఉదయం సుమారు గంటన్నర ఆలస్యంగా విశాఖ చేరింది. ఉదయం 7.40 గంటలకు రావాల్సి ఉండగా, 9.25 గంటలకు వచ్చింది. ఇక చెన్నై-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) కూడా ఆదివారం సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ఉదయం 7.50 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా...10.10 గంటలకు చేరింది.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

విశాఖపట్నం, ఆగస్టు 11: గిరిజనులంతా ఐక్యంగా ఉండాలని, అందరూ కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమం లో ఆమె మాట్లాడారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు కూడా విద్యావంతులు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమాజ స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని, అన్ని రంగాల్లో ప్రతిభ కనపరిచేలా పిల్లలను తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం వివిధ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే ఎమ్మెల్యే శిరీషాదేవిని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సన్మానించింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

రైతుబజారుపై నిర్లక్ష్యం నీడ

ప్రారంభించిన అనతికాలానికే మూత

- పునఃప్రారంభానికి చర్యలు తీసుకోని అధికారులు, పాలకులు
- తుప్పలతో నిండిన ప్రాంగణం
- పాడైన కూరగాయల షెడ్లు
- ఎలమంచిలి రైతుబజారు దుస్థితి



తుప్పలు పేరుకుపోయి ఉన్న రైతుబజారు

ఎలమంచిలి, ఆగస్టు 11: వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని రైతు బజారు పూర్వ వైభవం కోల్పోయింది. ప్రస్తుతం తుప్పలతో ప్రాంగణం నిండిపోయింది. నియోజకవర్గ కేంద్రంలోని ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించాలనే లక్ష్యంతోపాటు రైతులకు గిట్టుబాటు ధర కోసం 13 ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన రైతు బజారు మూలకు చేరింది. వివరాల్లోకి వెళితే..

ఎలమంచిలి పట్టణానికి ప్రతి రోజూ మండలంలోని రైతులతో పాటు ఎస్.రాయవరం మండల రైతులు తాము పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చేవారు. రైతులు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో దళారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో వారు రోడ్డు పక్కనే వాటిని ప్రజలకు నేరుగా విక్రయించడం మొదలు పెట్టారు. దీంతో కొన్ని సందర్భాల్లో దళారులు, రైతులకు మధ్య గొడవలు కూడా జరిగేవి.



రోడ్డు పక్కనే కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

అలాగే పట్టణ వాసులు కూడా బయట మార్కెట్లో అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఈ సమస్య పరిష్కరించేందుకు అప్పటి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు 2011వ సంవత్సరంలో ఎంపీడీవో కార్యాలయం పక్కన రైతు బజారును ఏర్పాటు చేశారు. రోడ్డుపై విక్రయిస్తున్న రైతులందరికీ రైతుబజారులో అవకాశమిచ్చారు. అలాగే దళారుల చేతిలో మోసపోకుండా తామే విక్రయించుకోవడానికి అవకాశం లభించింది. దీంతో రైతులు సంతోషించారు. అయితే రైతుబజారు ప్రారంభించిన కొంత కాలానికే మూతపడింది. అప్పటి నుంచి రైతు బజారును పునఃప్రారంభించేందుకు పాలకులు గాని, అధికారులు గాని దృష్టి సారించలేదు.

ఏళ్ల తరబడి పునఃప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతుబజారులోని షెడ్లు దెబ్బతిన్నాయి. రైతు బజారు ఆవరణంతా తుప్పలు, మొక్కలు విపరీతంగా పెరిగి పోయాయి. గత ఐదేళ్లలో రైతుబజారు పునఃప్రారంభానికి వైసీపీ పాలకులు కనీసం చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన షెడ్లు శిథిల మయ్యే స్థాయికి చేరుకున్నాయి. రైతు బజారులో మొక్కలు, తుప్పలు ఏపుగా పెరగడంతో షెడ్లు కూడా కనిపించకుండా పోతున్నాయి. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా పునఃప్రారంభించాలని రైతులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీలకు వినతి

కొత్తూరు, ఆగస్టు 11 : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, బి.హైమారావు, అనకాపల్లి జిల్లా ప్రతినిధులు పి.వి.రమణ, నక్కా శ్రీనుబాబు, దడాల శ్రీదేవి, కాండ్రేగుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు వారంతా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ ఎన్‌జీవో భవనంలో ప్రభుత్వ సమన్వయ కమిటీ ప్రతినిధులుగా హాజరైన ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు ఏఎస్ రామకృష్ణలకు సమస్యలు వివరించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జీవో నంబరు 29 ప్రకారం చేయాలని, జీవో నంబరు 117, 53లను వెంటనే రద్దు చేసి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాల కోరారు. అలాగే, రాష్ట్ర సమస్యలతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో అనుకోని విధంగా గిరిజన ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకురావాలని కోరినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావులకు వినతిపత్రం అందజేస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

108 అంబులెన్స్‌లో ప్రసవం

- ఆడ బిడ్డకు జన్మనిచ్చిన కొత్తూరు మహిళ

కొత్తూరు, ఆగస్టు 11 : అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి చెందిన దీపిక అనే మహిళ ఆదివారం 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ముందుగా జరిపిన పరీక్షల్లో వచ్చే నెలలో కాన్పు అవుతుందని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. ఇంతలో ఆది వారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్లారు. అక్కడి వైద్యులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యుల తనిఖీల అనంతరం కడుపులో బిడ్డ బరువు తక్కువగా ఉండడంతో 11.20కి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా మార్గ మధ్యలో పోర్టు ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి నొప్పులు మరింత పెరిగాయి. 108 వాహనాన్ని పక్కన ఆపి పురుడు పోశారు. దీపిక మొదటి కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని టెక్నీషియన్ నారాయణ, ఆశ కార్యకర్త, పైలెట్ తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.



ఆడ బిడ్డకు జన్మనిచ్చిన దీపిక

కమనీయం అప్పన్న కల్యాణం



సింహాచలం,ఆగస్టు 11 : వరాహలక్ష్మీన్ృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

21న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్

- విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ గౌరవాధ్యక్షులు కృష్ణస్వరూప్ పిలుపు

పాయకరావుపేట, ఆగస్టు 11 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన జరిగే భారత్ బంద్‌ను అంతా విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ గౌరవాధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం పాయకరావుపేటలో మాల మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాస్తవాలతో కూడిన ఆందోళన చేపట్టిన ఎంఆర్‌పీఎస్ నేతతో ఆర్‌ఎస్‌ఎస్, ఎన్డీఏ సర్కారు కుట్రలు చేసి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేశారని ఆరోపించారు. దీని వలన రాష్ట్రంలో అధికంగా ఉన్న మాలలతో పాటు 58 ఎస్సీ ఉప కులాలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా భారత్ బంద్ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, దువ్వాడ రాజు, పండాడ కొండబాబు, జి.సతీష్, యాదగిరి, నానాజీ పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

మలుపులతో పొంచి ఉన్న ప్రమాదం

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి

పరవాడ, ఆగస్టు 11 : పట్టణంలోని దీపాంజలినగర్ నుంచి వాడ చీపురుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా గొల్లపేట వద్ద గల మలుపుతో పాటు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సమీపంలో గల ఎల్ ఆకారంలో గల మలుపు వాహనదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పలువురు గాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. పీహెచ్‌సీ సమీపంలో గల ఎల్ ఆకారం మలుపు వద్ద గతంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఆటో బోల్తా పడడంతో ఈ దుర్ఘటన జరిగింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆయా మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వాడచీపురుపల్లి పీహెచ్‌సీ సమీపంలో...

గొల్లపేట సమీపంలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మలుపు

వేపాకుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

- పెద్ద సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం వేపాకుల అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు అమ్మవారిని వేపాకులతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రావణ మాసం భాను సప్తమి సందర్భంగా ఈ అలంకరణ చేపట్టారు. సెలవుదినం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కాటేజీలు, పరిసర ప్రాంతాల్లో కుటుంబాల సమేతంగా వచ్చినవారు వంటలు వండుకుని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.



నూకాంబిక అమ్మవారిని వేపాకులతో అలంకరించిన దృశ్యం



నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

విభాగాలపై విచారణ

- ఫిర్యాదులు, ఆరోపణలపై పరిశీలనకు ఏయూలో ప్రత్యేక కమిటీ
- ఐదుగురు సభ్యులతో ఏర్పాటు
- 19వ తేదీలోగా నివేదిక అందించాలని రిజిస్ట్రార్ ఆదేశం

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ్ ఆదేశాలతో ప్రత్యేక కమిటీని నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజా శంకర్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.నాగేశ్వరరావులను కమిటీలో సభ్యులుగా నియమించారు. కమిటీ సభ్యులు నిష్పక్ష పాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో ప్రథమ సంవత్సరం తరగతుల నిర్వహణ, పర్యవేక్షణ, ఆయా విభాగాల్లో అధ్యాపకుల హాజరు, తదితర అంశాలు, కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగాలు, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో హాల్ టికెట్లు మంజూరు చేయడానికి ఫైన్ల రూపంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఈ కమిటీ విచారించనుంది. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, ఎకనామిక్స్ విభాగాలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందిపై పలు వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలని సూచించారు. కమిటీ సభ్యులు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన విభాగాల్లో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, లేబొరేటరీ సిబ్బంది, విద్యార్థులతో సమావేశమై వివరాలు సేకరించాలని సూచించారు. కమిటీ సభ్యులు ఈ నెల 19వ తేదీలోగా సీల్డ్ కవర్‌లో తమ నివేదికను అందించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఆగస్టు 11: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన అంతర్జాతీయ అర్హత కలిగిన బ్లూ బ్యాడ్జి అంపైర్ డాక్టర్ డీవీఎస్‌వై శర్మ నియమితులయారు. ఈ మేరకు భారత్ టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల11 నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లోని రైంబో ఖేలో ఇండియా రెసిడెన్సియల్ అకాడమీలో జరిగే జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్ఐసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శర్మ ఇప్పటివరకు అనేక అంతర్జాతీయ, జాతీయ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరుగా సేవలందిస్తున్న శర్మ..జాతీయ ర్యాంకింగ్ టోర్నీకి అంపైర్‌గా నియమితులు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



డీవీఎస్‌వై శర్మ

దువ్వాడ మీదుగా నాందేడు, శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 11: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వయా దువ్వాడ మీదుగా నాందేడు, శ్రీకాకుళం రోడ్డు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 07487 నంబరు గల రైలు ఈనెల 14న మధ్యాహ్నం 2.00 గంటలకు నాందేడులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల రైలు ఈనెల 15న సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి రాత్రి 7.33 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 3.25 గంటలకు నాందేడు చేరుతుంది. ముద్‌ఖేడ్, ధర్మబాద్, బాసర, నిజామాబాద్, కామరెడ్డి, సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.



భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

వేతనాలు చెల్లించకుంటే చలో కలెక్టరేట్

▸ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్

చింతపల్లి, ఆగస్టు 11: మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు చెల్లించకుంటే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. చింతపల్లి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూనియన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు వేల మంది భోజన కార్మికులు పని చేస్తున్నారని, వారికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో భోజన కార్మికుల సంఘం ప్రతినిధులు కె.పద్మ, తండా సింహాచలం, ముట్టడం శకుంతల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

లంబసింగిలో పర్యాటకుల సందడి



చెరువుల వేనం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

చింతపల్లి, ఆగస్టు 11: ఆంధ్ర కశ్మీర్ లంబసింగిలో పర్యాటకులు సందడి చేశారు. రెండు రోజుల పాటు సెలవులు కలసి రావడంతో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. చెరువులవేనం వ్యూ పాయింట్, లంబసింగిలో పర్యాటకుల సందడి కనిపించింది. చెరువులవేనం వ్యూ పాయింట్ వద్ద మంచు అందాలను తిలకిస్తూ ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు పోటీ పట్టారు. దీంతో లంబసింగి పరిసర ప్రాంతాల్లో సాయంత్రం వరకు పర్యాటకుల రద్దీ కనిపించింది.

శ్రమదానంతో తుప్పల తొలగింపు



వెన్నెల రహదారికి శ్రమదానంతో తుప్పలు తొలగిస్తున్న స్థానికులు

జి.మాడుగుల, ఆగస్టు 11: కుంబిడిసింగి పంచాయతీ పరిధిలోని వెన్నెల గ్రామస్థులు శ్రమదానంతో తుప్పలు తొలగించారు. గ్రామం నుంచి మత్స్యపురం ప్రధాన రహదారి వరకు ఇరువైపుల పేరుకుపోయిన తుప్పలను యువకులు తొలగించారు. ఏపుగా ఎదిగిన తుప్పలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ పనికి పూనుకున్నట్లు స్థానిక యువకులు తెలిపారు.

పద్మశాలీలకు పెన్షన్ మంజూరు చేయాలి



రాజారావుకు వినతిపత్రం అందిస్తున్న సంఘం జిల్లా నాయకులు

పాడేరు రూరల్, ఆగస్టు 11: దశాబ్దాలుగా జిల్లాలో జీవనం సాగిస్తున్న 50 ఏళ్ల పైబడిన పద్మశాలీలకు పెన్షన్ మంజూరు చేయించాలని సంఘం రాష్ట్ర కన్వీనర్, చేనేత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పప్పు రాజారావుకు అల్లూరి జిల్లా నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో సంఖ్యా బలం ఉన్నప్పటికీ పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యత కరువైందని వాపోయారు. రేషన్ కార్డు ఉండి 50 ఏళ్ల పైబడిన ప్రతీ ఒక్కరికి పెన్షన్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని, టెక్నాలజీతో వృత్తి కొనసాగించడానికి ప్రతీ జిల్లాలో క్లస్టర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గతంలో కుటుంబ సభ్యులంతా కష్టపడినా రోజుకు రూ.200 రావడం కష్టంగా ఉండేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చేనేత కార్మికులను ఆదుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేనేత క్లస్టర్లు విస్తరింపచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మామిడి సూరప్పారావు, రాష్ట్ర డైరెక్టర్ పప్పు రమణ, జిల్లా కార్యదర్శి దొడ్డి సురేష్, నాయకులు చుక్కల సాంబమూర్తి, బేత లోవరాజు, సిద్ధినాతి కొండలరావు, రుషిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన స్వచ్ఛ సంకల్ప వాహనాలు



తుప్పల మధ్యలో నిరుపయోగంగా పడివున్న స్వచ్ఛ సంకల్ప వాహన ఇదే..

కొయ్యూరు, ఆగస్టు 11: గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు గత ప్రభుత్వ హయాంలో లక్షలు వెచ్చించి అట్టహాసంగా సరఫరా చేసిన స్వచ్ఛ సంకల్ప వాహనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయల ప్రజా ధనంతో కొనుగోలు చేసిన ఈ వాహనాలు వినియోగించేందుకు వీలుగా పారిశుధ్య కార్మికులను నియమించలేదు. దీంతో మండలంలోని 33 పంచాయతీలలో ఒకటి, రెండు పంచాయతీలలో మినహా మిగిలినవన్నీ సరఫరా చేశారు. నాటి నుంచి చెత్తకుప్పలు, పిచ్చి తుప్పల మాటున నిరుపయోగంగా తుప్పు పట్టి పోతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చెత్త నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారని, అనంతరం వచ్చిన వైఎస్ఆర్ సీపీ నిర్లక్ష్యం చేయడంతో గ్రామాలలో పేరుకున్న చెత్తను ఎక్కడికి తరలించాలి తడి, పొడి చెత్తలు వేరు చేయించేందుకు నిధులు ఎలా సమకూర్చుకోవాలి అనే విషయమై సందిగ్ధత ఏర్పడడంతో ఈ వాహనాలు వినియోగంలోకి తేలేకపోయాయి. ఇప్పటికైనా పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పారిశుధ్య పరిరక్షణకు జనాబా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, అప్పుడే పారిశుధ్య మెరుగుకు ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రిని వినియోగించే చూస్తామని సర్పంచులు తెలిపారు. మండలంలోనే కాకుండా ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని పంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్వచ్ఛ సంకల్ప వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

చినుకుపడితే వణుకు

▸ మత్స్యగెడ్డ పాయలపై వంతెనల నిర్మాణం.. వాగ్దానాలకే పరిమితం!

▸ గిరిజనుల రాకపోకలకు తీవ్ర అవరోధం

▸ పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 11: ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు వచ్చిపోతున్నా గిరిపుత్రుల స్థితిగతుల్లో ఏమాత్రం మార్పులు కానరావడం లేదు. ప్రభుత్వం ఏదైనా మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల ప్రజల రవాణా కష్టాలు షరామామూలే! అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలు, వాగ్దానాలతో సరిపెట్టేయడంతో మత్స్యగెడ్డ పాయలపై వంతెనలు, కల్వర్టుల నిర్మాణ పనులు కలగానే మిగులుతున్నాయి.

మండలంలోని సుమారు 12 పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డ అవతల జీవనం సాగిస్తున్నారు. మత్స్యగెడ్డ పాయలపై నూతన కల్వర్టులు, వంతెనలు నిర్మాణం చేపడతామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు గుప్పిస్తున్నారు. ఏళ్లు కావస్తున్నా వారి మాటలు ఆచరణలో కానరావడం లేదు. దాని పర్యావసంగా చిన్నపాటి చినుకుపడితే చాలు గెడ్డ అవతల జీవిస్తున్న ప్రజల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతుంది. అయినప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు మాత్రం పట్టదన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు సమీపంలో ప్రవహిస్తున్న చిట్టగెడ్డపై వంతెన నిర్మాణంకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా కలెక్టర్, పీవోలు పలు సందర్భాల్లో ఇటుగా పర్యటించినపుడు హామీలు గుప్పించారు. వాగ్దానాలు చేసిన ప్రజా ప్రతినిధుల పదవీ కాలం ముగిసిపోయింది, అధికారులు బదిలీపై వెళ్లిపోయారు తప్పా వారి మాటలు మాత్రం కార్యరూపం దాల్చడంలేదు. దీంతో చిట్టి



అసంపూర్తి పనులతో నిలిచిపోయిన ముంతగుమ్మి వంతెన



జ్వర బాధితురాలిని అతి కష్టంపై గెడ్డ దాటిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

గెడ్డ పరివాహక ప్రాంతీయులు ఏ చిన్నపాటి అవసరానికైనా నాటుపడవల సహాయంతో మత్స్యగెడ్డ దాటుతున్నారు. గెడ్డ దాటేందుకు నాటుపడలను ఉపయోగించడం వల్ల తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదమని తెలిసినా గెడ్డ దాటేందుకు నాటుపడలను ఉపయోగించాల్సి వస్తుందని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్ సమీపంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయలపై నూతన కల్వర్టు నిర్మాణం పనులు కలగానే మిగిలిపోయింది. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు వాగ్దానాలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి.

మండలంలోని బుంగాపుట్టు, రంగబయలు, బూసిపుట్టు, లక్ష్మీపురం తదితర పంచాయతీల్లో పలు గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డ పాయలపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందించారు. అయినా ఫలితం కానరావడం లేదు. దాని పర్యావసంగా వర్షాకాలం వచ్చిందంటే మత్స్యగెడ్డ పాయలు అవతల జీవనం సాగిస్తున్న ప్రజలు గజగజలాడిపోతున్నారు. గెడ్డ



గెడ్డ దాడేందుకు నాటుపడవలను వినియోగిస్తున్న దృశ్యం

పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతో వర్షా కాలం బాహ్య ప్రపంచంతో వారికి సంబంధాలు తెగిపోతున్నాయి. అటుగా వాహన రాకపోకలు స్తంభించిపోవడంతో పాటు 108 అత్యవసర వాహన సేవలకు సైతం దూరమవుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో పంచాయతీ కేంద్రానికి వచ్చేందుకు ద్విచక్ర వాహనాలను కావిడి సహాయంతో గెడ్డ దాటించాల్సి వస్తుందని ఆయా ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతలు, పంచాయతీ, మండల కేంద్రానికి, వివిధ పనుల నిమిత్తం గెడ్డ దాటి ఎక్కడికి వెళ్లినా ఇంటికి వచ్చే వరకు భయం భయంగా ఉంటుందని ఆ ప్రాంతీయులు వాపోతున్నారు.

వంతెనల పనులు పూర్తిచేయాలి

లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ, ముంతగుమ్మి, లక్ష్మీపురం సమీపంలో మత్స్యగెడ్డ పాయలపై నిర్మిస్తున్న నూతన వంతెనల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయా ప్రాంతీయులు కోరుతున్నారు. పనులు జరుగుతున్న తరుణంలో వర్షా కాలం వచ్చేయడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ ఏడాది కూడా రవాణా కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఆ పంచాయతీ పరిధిలోని కోడాపుట్టు గ్రామానికి చెందిన గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతూ గెడ్డ దాటలేక రెండు రోజులు పాటు ఇంటిలో ఉండిపోయిన విషయం తెలిసిందే. తరువాత అష్టకష్టాలపై ఆస్పత్రికి తీసుకువెళ్లగా బిడ్డ, మృతి చెదారు. అలాగే అదే పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన జ్వర బాధితురాలిని గెడ్డలు దాటుతూ సాహసోపేతంగా ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. వర్షా కాలంలో ప్రాణాలను నిలబెట్టుకొనేందుకు మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతీయులు యుద్ధం చేయాల్సి వస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు చిత్తశుద్ధితో నూతన కల్వర్టు, వంతెనలు నిర్మాణ పనులు జరిగే విధంగా ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

పాడేరు రూరల్, ఆగస్టు 11: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచే ఆలయం భక్తులతో కళకళలాడింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ ఆదివారం కావడంతో భక్తుల సంఖ్య అధికమైంది. ఆలయ ప్రసాద కమిటీ ప్రతినిధులు భక్తులు ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లో మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకొనేందుకు వందల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



ధారాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

కిటకిటలాడిన ధారాలమ్మ ఆలయం

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువైన ధారాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. 20 రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆలయానికి భక్తుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు శ్రావణ మాసం ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల భక్తులతో బాటు తెలంగాణ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా తరలిరావడంతో ఆలయం రద్దీగా కనిపించింది.

వారపు సంతలో వ్యాపారుల చింత

▸ కనీస సదుపాయాల లేమితో అగచాట్లు

▸ షెడ్లు లేక వర్షాలు, ఎండల్లోనే దుకాణాల నిర్వహణ

ముంచంగిపుట్టు, ఆగస్టు 10: మండల కేంద్రంలోని వారపు సంతలో తగిన సదుపాయాలు లేక వ్యాపారులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా సంత ప్రాంగణంలో దుకాణాలను ఏర్పాటు చేసుకొనేందుకు షెడ్లు లేకపోవడంతో నరకం చూస్తున్నారు. సంత ప్రాంగణంలో సిమ్మెంట్ దిమ్మలు నిర్మాణం, షెడ్లు నిర్మించాలని కొన్నేళ్లుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వ్యాపారులు కోరుతున్నారు. దీనికి వారు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. అయితే హామీలు ఇస్తున్నా కార్యరూపం దాల్చడంలేదు. దీంతో వ్యాపారులు ప్రధాన రహదారికి ఇరువైపులా, సంత ప్రాంగణంలో పలుచోట్ల తాత్కాలికంగా పాకలను ఏర్పాటు చేసుకుని వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. చిన్నపాటి చినుకుపడితే సామాన్లు తడిచి ముద్దవుతున్నాయి. కొన్ని రకాల సామాన్లు, తినుబండారాలు పాడవుతున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా దుకాణాలను



రహదారికిరువైపులా కూరగాయ దుకాణాలు వేసుకున్న వ్యాపారులు

పెట్టడం వల్ల వారపు సంత రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముంచంగిపుట్టు వారపు సంతలో పాటు జోలాపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్ట, బూసిపుట్టులో సంతల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని వ్యాపారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అల్లం వంగడాలపై పరిశోధనలు

... 3వ పేజీ తరువాయి

పీచు తక్కువగా, కొమ్ము పరిమాణం పెద్దదిగా ఉండే అల్లం రకాలకు అధిక డిమాండ్ ఉంది. గిరిజన రైతుల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా చేసుకొని మేలిజాతి వంగడాలను పరిచయం చేసేందుకు శాస్త్రవేత్తలు పరిశోధనలు 2021లో ప్రారంభించారు. రెండేళ్ల పరిశోధనల్లో నాడియా బోల్డ్ రకం వంగడం గిరిజన ప్రాంతానికి అత్యంత అనుకూలమని గుర్తించారు. ఈ మేరకు విత్తనాభివృద్ధి కోసం శాస్త్రవేత్తలు పరిశోధన స్థానంలో ప్రొట్రేల్లో అభివృద్ధి చేసిన అల్లం మొక్కల నాట్లు నెల రోజుల క్రితం వేశారు. సాధారణంగా ఎకరానికి 500 కిలోల విత్తనం అవసరం. ప్రొట్రేల ద్వారా మొక్కలను అభివృద్ధి చేయడం వల్ల ఎకరాకి 250 కిలోలు సరిపోతుంది. దుంప కుళ్లు తెగులు ఆశించదు.

ఏడు రకాలపై అధ్యయనం

స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో ఏడు రకాల అల్లం వంగడాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ఉద్యాన పరిశోధన స్థానాల నుంచి మేలిజాతి విత్తనాలను దిగుమతి చేసుకున్నారు. జాన్‌జింజర్ (కేరళ), గోరుబతాని, నాడియా బోల్డ్ (పశ్చిమబెంగాల్), భైస్ (సిక్కిం), గోరుబతాని (పశ్చిమ బెంగాల్), పీజీఎస్-121, పీజీఎస్-102,పీజీఎస్-95 (ఒడిశా) రకాలపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు. ఈ రకాల అల్లం కొమ్ములు పరిమాణంలో పెద్దవిగాను, పీచు తక్కువగా ఉంటుంది.

విత్తనం అభివృద్ధి..

ఏడు రకాల వంగడాలపై పరిశోధనలు నిర్వహిస్తూనే విత్తనం అభివృద్ధికి శాస్త్రవేత్తలు చర్యలు తీసుకుంటున్నారు. ఏడు రకాల్లో గిరిజన ప్రాంతంలో తెగుళ్లను తట్టుకుని నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే వంగడాలను శాస్త్రవేత్తలు ఎంపిక చేయనున్నారు. ఈ ఏడాది ప్రాథమికంగా నాడియా బోల్డ్, జాన్‌జింజర్ విత్తనం అభివృద్ధికి సాగును ప్రారంభించారు. ఆరు రకాలపై నాలుగో ఏడాది అధ్యయనం కొనసాగిస్తూ నాడియా బోల్డ్, జాన్‌జింజర్ విత్తన అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

వచ్చే ఏడాది నాడియా బోల్డ్ పంపిణీ

-శివకుమార్, ఉద్యాన పరిశోధన స్థానం, చింతపల్లి

వచ్చే ఏడాది మేలిజాతి వంగడం రైతులకు చిరు సంచుల్లో పంపిణీ చేస్తాం. రెండు,మూడేళ్ల ప్రయోగాత్మక సాగుల్లో పూర్తి చేశాం. చివరి ఏడాదిగా విత్తనం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం. వచ్చే ఏడాదికి నాడియా బోల్డ్ విత్తనం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. నాడియా బోల్డ్ అల్లం కొమ్ముల పరిమాణంలో పెద్దవిగా ఉంటుంది. గుజ్జు అధికంగా ఉంటుంది. దీంతో మార్కెట్‌లో ఈ అల్లంకి గరిష్ఠ ధర లభించడంతోపాటు డిమాండ్ అధికంగా ఉంటుంది. నాడియా బోల్డ్ ఎకరానికి 6 నుంచి 7టన్నుల దిగుబడినిస్తుంది. వచ్చే ఏడాది ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు 3 నుంచి 5 కిలోల విత్తనం అందజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం.

మారుమూల గ్రామాల్లో 'ఎన్‌ఆర్ఎస్‌టీసీ'లు

... 3వ పేజీ తరువాయి

ప్రాంతాల్లో సైతం విద్యాభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతోనే అధిక సంఖ్యలో ఎన్ఆర్‌టీసీలను ప్రభుత్వం మంజూరు చేసిందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో ఎన్ఆర్ఎస్‌టీలు ఏర్పాటు చేసే గ్రామాలివే..

మన్యంలో పది మండలాల పరిధిలో ఎంపిక చేసిన 39 గ్రామాల్లో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. హుకుంపేట మండలంలో ఈదులగరువు, అరకులోయలో కెంటుబడి, చింతపల్లిలో లక్కవరం, దిగవలసపల్లి, డుంబ్రిగుడలో బుద్దంగి, కుమిడికుట్టి, తడ, జీకేవీధి మండలంలో కిన్నెర్లబంద, కొమ్ముసంపంగి, కొండపల్లి, చెరుకుపాలెం, గుమ్మలగొంది, జి.మాడుగుల మండలంలో భూంబొడ్డు, జీరుగులగొయ్యి, సలమరంగి, వందనాపల్లి, కొయ్యూరు మండలంలో జోగంపేట, కాకులమామిడి, కొమ్మినోడు, ఉసిరికపాడు, బడ్డమామిడిలంక, ఈదులబంద, గంపరాయి, వైఎన్.పాకలు, పుట్టకోట, ముంచంగిపుట్టు మండలంలో బరెంగుల, బొర్రపనస, మెట్టగూడ, పాడేరు మండలంలో బర్లుపుట్టు, నేరల్లు, నందిగరువు, సల్దిగెడ్డ, పెదబయలు మండలంలో చీపురుగొంది, కిలుములు, కుంటిమామిడి, లింగేరుపుట్టు, ననబరి, సుజ్జారి గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేస్తారు. ఆయా గ్రామాల్లో డీఎడ్ అర్హత కలిగిన అభ్యర్థులుంటే వారినే విద్యావలంటీర్‌గా నియమిస్తారు. దానిపై ఆసక్తి ఉన్న డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు తమ పరిధిలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల13 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు తెలిపారు.

బొర్రాగుహల అందాలకు కలెక్టర్లు ఫిదా

... 3వ పేజీ తరువాయి

దినేశ్‌కుమార్‌కు అందజేశారు.

బొర్రా గుహలుపై రైల్వే లైన్ మార్చాలి

బొర్రాగుహలుపై రెండో రైల్వే ఏర్పాటుతో ముప్పు వాటిల్లే అవకాశం ఉందని బొర్రా సర్పంచ్ అప్పారావు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై రైల్వే శాఖతో చర్చించి, రెండో లైన్ ట్రాక్ మార్పునకు చర్యలు చేపట్టాలని కోరారు. జిప్‌లైన్ నిలిచిపోవడానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిప్‌లైన్ వివాదం పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు పర్యాటక శాఖ గైడ్స్, కార్మికుల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏటా గుహలకు వచ్చే ఆదాయం వివరాలను మేనేజర్, కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, ఈవోపీఆర్డీ తోటరావు, వీఆర్వో విజయమణి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

గిరిజన మ్యూజియం సందర్శన

అరకులోయ గిరిజన మ్యూజియాన్ని ఆదివారం అల్లూరి, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు దినేశ్‌కుమార్, విజయకృష్ణన్ పిల్లలతో కలిసి తిలకించారు. గిరిజనుల జీవన విధానం ఎలా ఉండేది.. ఆభరణాలు, వేట సాధనలు, వంటగది ఉపకరణాలు, రోజువారీగా ఉపయోగించే వస్తువులను చూసి మురిసిపోయారు.

మాచ్‌ఖండ్‌లో మెరుగుపడ్డ విద్యుదుత్పాదన

ముంచంగిపుట్టు, ఆగస్టు 11: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పాదన ఆదివారం మెరుగుపడింది. ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేసే సామర్థ్యం ఈ విద్యుత్ కేంద్రానికి ఉంది. అయితే నీటి సమస్య, జనరేటర్లు ఆశించిన స్థాయిలో పనిచేయకపోవడం, వివిధ కారణాల వల్ల నాలుగు, ఆరు నంబర్ల జనరేటర్ల సహాయంతో కేవలం 46 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతుండేది. రెండు వారాలుగా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం అధికారులు, సిబ్బంది శ్రమించి మూడో నంబరు జనరేటర్‌ను ఆదివారం వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం మూడు జనరేటర్ల సహాయంతో 66 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి నిల్వలు సైతం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. దీంతో విద్యుత్ ఉత్పాదనకు నీటి సమస్య కూడా తప్పిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మిగిలిన జనరేటర్లను కూడా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామని వారు చెప్పారు.

మత్స్యకారులకు బోట్లు అందించాలి

ముంచంగిపుట్టు, ఆగస్టు 11: మండలంలోని 23 పంచాయతీల పరిధిలో గిరిజన మత్స్యకారులను వలలు, బోట్లు అందించాలని టీడీపీ డివిజన్ నాయకుడు పి.పాండురంగస్వామి డిమాండ్ చేశారు. దారెల పంచాయతీలోని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ద్వారా శతశాతం రాయితీపై మత్స్యకారులకు వలలు, బోట్లు అందించాలని, సర్వే నిర్వహించి గిరిజన మత్స్యకారులుగా గిరిజన జాలర్లను గుర్తించాలని, ఇంజన్ బోట్లను నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్స్‌లను అందించాలని ఆయన విన్నవించారు.

అపరిచితుల నుంచి వస్తువులు కొనొద్దు

సీలేరు, ఆగస్టు 11: పరిచయం లేని వ్యక్తుల నుంచి వస్తువులు కొనకూడదని ఎస్ఐ రామకృష్ణ కోరారు. మైదాన ప్రాంతాలకు చెందిన కొంత మంది అక్కడ దొంగిలించిన కార్లను, ద్విచక్ర వాహనాలను సీలేరు ధారకొండ ప్రాంతాలకు తీసుకువచ్చి అమాయకులను మభ్యపెట్టి వాటిని విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆదివారం దువ్వాడకు చెందిన ఇద్దరు యువకులు ధారకొండలో తాకట్టు పెట్టాలని ప్రయత్నించగా, పోలీసులకు విషయం తెలియడంతో పోలీసుల విచారించగా దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ కారు అపహించినట్లు ఎస్ఐకు సమాచారం అందించి, ఈ మేరకు ఈ కారును సీలేరు పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కారుకు సంబంధించిన అసలైన యజమాని వస్తే వారికి ఈ కారును అప్పగించడం జరుగుతుందని ఎస్ఐ రామకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు.

13న సాంస్కృతిక పోటీలు

చింతపల్లి, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చింతపల్లి డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. వక్తృత్వ, వ్యాసరచన, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషధారణ తదితర పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. 15 ఏళ్లు పైబడిన పాఠశాల స్థాయి నుంచి కళాశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు.

జీసీసీ బంక్‌లో పెట్రోలు లేక వాహనదారుల ఇబ్బందులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 11: మండల కేంద్రంలోని జీసీసీ బంక్‌లో రెండు రోజులుగా పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీసీసీ యాజమాన్యం సకాలంలో కంపెనీకి డబ్బులు చెల్లించకపోవడంతో బంక్‌లో పెట్రోల్ సమస్య నెలకొంటుంది. స్థానిక బంక్‌లో పెట్రోల్ లేకపోవడం వల్ల 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపల్లి వెళ్లి పెట్రోల్ వేయించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో గూడెం పరిధిలోని వాహనదారులు రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి జీసీసీ బంక్‌లో పెట్రోల్ అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

జి.మాడుగుల, ఆగస్టు 11: గడుతూరు పంచాయతీ పరిధిలోని గొడ్డ గ్రామంలో ఆదివారం వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. విలేకరుల సంఘం నాయకులు గ్రామంలో సందర్శించి వృద్ధులకు రగ్గులను అందించారు. సంఘం ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు కార్యచరణ రూపొందించామని చెప్పారు.

నేడు క్యాన్సర్ పరీక్షలు

అరకులోయ, ఆగస్టు 11: మండలంలోని సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైఎస్.జయమ్మ మెమోరియల్ ట్రస్టు, విశాఖపట్నం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరబాద్ వారి ఆధ్వర్యంలోని ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలు నుంచి సాయింత్రం మూడు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. బీపీ, షుగర్‌తో పాటుగా ఎక్స్‌రే, ఈసీజీ, రొమ్ము, గర్భాశయం, నోటి క్యాన్సర్ పరీక్షలు ఉచితం చేస్తారు.